పలమనేరు మండలం, టీ ఒడ్డూరు గ్రామంలో ఈ నెల 10వ తేదీన డయేరియా వ్యాపించింది. 67 మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రులపాలయ్యారు. గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసి మిగిలిన వారికి వైద్య పరీక్షలు చేశారు. గ్రామానికి సరఫరా అయ్యే నీటిని నిలిపేసి పది రోజుల పాటు ట్యాంకర్ల ద్వారా అందించారు. పది రోజుల తర్వాత డయేరియా అదుపులోకి వచ్చింది.

కారణం ఏమంటే: గ్రామానికి నీళ్లు సరఫరా అయ్యే పైప్‌లైనుకు రంధ్రాలు పడ్డాయి. దీంతో తాగునీరు కలుషితమై డయేరియా ప్రబలింది.

గుడుపల్లె మండలం వెంకటాపురంలో ఈ నెల 21వ తేదీన 23 మంది గ్రామస్తులు డయేరియా బారిన పడ్డారు. ఇక్కడా నీటి కలుషితంతోనే వాంతులు, విరేచనాలకు గురయ్యారు. ఆపై గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కేసులు నమోదు కాకపోవడంలో శిబిరాన్ని తొలగించారు.

ఎందుకిలాగంటే: గ్రామంలోని నీటి ట్యాంకును శుభ్రం చేయకపోవడం, రంధ్రాలు పడిన పైప్‌లైన్ల ద్వారా వర్షపు నీటితో తాగునీరు కలుషితమై సరఫరా కావడం ఇక్కడ డయేరియా ప్రబలడానికి ప్రధాన కారణం.

పాలసముద్రంలో ఈ నెల 18వ తేదిన 150 మంది డయేరియాకు గురయ్యారు. వీరిలో ఒక మహిళ మాత్రం తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ఆమెను చీలాపల్లి సీఎంసీకి తరలించి చికిత్స చేయించారు. అనంతరం మండల కేంద్రంలో రెండు చోట్ల వైద్య శిబిరం ఏర్పాటు చేసి చికిత్స అందించారు.

కారణం: పాలసముద్రంలో జరిగిన జాతరలో భక్తులు సమర్పించిన అంబలిలో ఫుడ్‌పాయిజన్ కావడం. దీనిని తాగిన వాళ్లంతా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు.




బంగారుపాళ్యంలోని మురుగు నీటి కాలువలో పూడిక తీయకపోవడంతో వ్యర్థాలతో నిండిపోయిన... - శాంతిపురంలో పూడిక తీయక అధ్వానంగా ఉన్న కాలువ

డై ఏరియాలు

జిల్లాలో డయేరియా కేసులు అమాంతం పెరిగిపోతున్నాయి. వర్షాకాలం కావడం.. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడం.. నీటి సరఫరా పైపులైన్లు లీకైన చోట నీరు కలుషిత కావడం.. ట్యాంకులు సక్రమంగా శుభ్రం చేయకపోవడం.. గ్రామాల్లో వర్షపు నీటి నిల్వతో అతిసార ప్రబలుతోంది. కలుషిత నీరు తాగడంతో ఎక్కువ మంది డయేరియా బారిన పడి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కేసులు నమోదైన ప్రాంతాలకు వైద్య సిబ్బంది వెళ్లి శిబిరాలు ఏర్పాటు చేసి హడావిడి చేస్తున్నారు. నివారణకు తీసుకోవాల్సిన చర్యలు మాత్రం చేపట్టడం లేదు. ఈ పరిణామంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. - చిత్తూరు రూరల్



పుంగనూరు మండలం భీమగానిపల్లిలో మురుగు నీటి కాలువ లేక రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

- ఎటుచూసినా కలుషిత నీరు, అపరిశుభ్రతే
- శుభ్రం చేయని ట్యాంకుల ద్వారా నీటి సరఫరా
- ఆస్పత్రులపాలవుతున్న ప్రజలు
- చిత్తూరు ఆస్పత్రిలోనే 1,118 కేసుల నమోదు
- ఇక, పీహెచ్‌సీల్లో మరెన్నో?

ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిన వైసీపీ ప్రభుత్వం

ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసింది. టీడీపీ హయాంలో నిర్మించిన నీటి ట్యాంకులు, కాలువలు తప్ప.. వైసీపీ పాలనలో ఒక్క కాలువ, ట్యాంకంటూ నిర్మించలేదు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎక్కడ చూసినా మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ.. ప్రజలను రోగాల బారిన పడేస్తోంది. ప్రతి 10 రోజులకు శుభ్రం చేయాల్సిన నీటి ట్యాంకులను నెలల తరబడి గాలికి వదిలేయడం ద్వారా నీరు కలుషితమవుతోంది.



పలమనేరులో కాలువలేక స్తంభించిన మురుగు

పంచాయతీల నిర్వీర్యం

వైసీపీ అధికారంలో వచ్చాక పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసింది. పంచాయతీల అభివృద్ధికి కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధుల్ని ఎప్పటికప్పుడు మళ్లించేసి, సర్పంచుల్ని డమ్మీలుగా మార్చేసింది. దీంతో గ్రామాల్లో సర్పంచులు చిన్నపాటి పనుల్ని కూడా చేయలేకపోతున్నారు. ఇలా జిల్లాలో సుమారు రూ.120 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల నిధుల్ని మళ్లించేసింది. దీంతో శుభ్రత లేని నీళ్లు తాగి ప్రజలు డయేరియా బారిన పడుతున్నారు. నగరాల్లో అధిక శాతం తాగునీటి పైప్‌లైన్లు మురుగు కాలవల్లోనే ఉన్నాయి. పైప్‌లైన్లు లీకేజీల కారణంగా ఆ నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.



పుంగనూరు మండలం భీమగానిపల్లిలో పైప్‌లైను లీకేజీ

దళితవాడలను గాలికి వదిలేసిన జగన్

'నా ఎస్సీలు, నా ఎస్టీలు' అని మాజీ సీఎం జగన్ తన ప్రసంగాల్లో పదేపదే చెప్పడం తప్పించి వారి బాగోగుల కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. 2019 నుంచి జిల్లాలోని దళితవాడలు అధ్వానంగా తయారయ్యాయి. ఒక్క మురుగు నీటి కాలువనూ కట్టలేదు. టీడీపీ హయాంలో కట్టిన కాలువల నిర్వహణనూ గాలికి వదిలేశారు. దీంతో డయేరియా కేసులు కూడా అధిక సంఖ్యలో దళితవాడల్లోనే నమోదవుతున్నాయి.

శాఖల మధ్య లోపించిన సమన్వయం

రోగాల నిర్మూలనకు వైద్య ఆరోగ్య శాఖ ఎంత ముఖ్యమో, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలూ అంతే ముఖ్యం. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీరు అందించడంతో ఈ రెండు శాఖలే కీలకం. ప్రతి 15 రోజులకు ఒకసారి ట్యాంకులు శుభ్రం చేయించడం, పైప్‌లైన్ల మరమ్మతులు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవడం లాంటి చర్యలు తీసుకోవాలి. అయితే ఈ శాఖల అధికారుల మధ్య సమన్వయం లోపంతో గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. ఆ సమయంలో గ్రామాల్లో హడావిడి చేసి.. ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. సీజనల్ వ్యాధులు నిర్మూలించాలని సమీక్షలు చేయడం తప్ప కార్యరూపం కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి అయినా సీజనల్ వ్యాధుల నిర్మూలన దిశగా అడుగులేస్తుందన్న ఆశావహంతో ప్రజలు ఉన్నారు.

మార్చి 26 నుంచి జూన్ 25 వరకు చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో నమోదైన డయేరియా కేసులిలా..

నెల	పురుషులు	మహిళలు	చిన్నపిల్లలు
మార్చి 26 - ఏప్రిల్ 25 వరకు	144	62	2
ఏప్రిల్ 26 - మే 25	173	189	2
మే 26 - జూన్ 25	323	214	9
మొత్తం	640	961	13

మూడు నెలల్లో 1,118 కేసులు

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ఏప్రిల్ నుంచి జూన్ 25వ తేది వరకు 1,118 మంది చికిత్స పొందారు. మూడు నెలల్లోనే జిల్లా ఆస్పత్రిలో ఇన్ని కేసులు నమోదవడం ఆందోళన కలిగించే అంశమే. బాధితుల్లో 13 మంది చిన్నారులు కూడా ఉన్నారంటే తీవ్రత అర్థమవుతోంది. ఇక, మండల కేంద్రాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స తీసుకున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంది.



కుప్పంలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ద్రావిడ వీసీ మధుజ్యోతి రాజీనామా



గుడుపల్లె, జూన్ 28: ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి పదవికి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి శుక్రవారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో తన పదవికి రాజీనామా సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఉన్నత విద్య కార్యదర్శికి పంపారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో ఆచార్యులుగా ఉన్న మధుజ్యోతి 2023 డిసెంబరు 29న వీసీగా బాధ్యతలు చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో వివిధ విశ్వవిద్యాలయాల్లో వీసీలుగా నియమితులైనవారంతా వరుసగా రాజీనామాలు చేస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఈమె రాజీనామా సమర్పించారు. అనంతరం ద్రావిడ వర్సిటీలోని కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో బోధన, బోధనేతర సిబ్బందితో ఆమె సమావేశమయ్యారు. తన పదవీ కాలంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కాగా వైసీపీ నాయకుల అండతో రిజిస్ట్రార్‌గా పదవి పొందిన ఏకే వేణుగోపాల్‌రెడ్డి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే జూన్ 4న రాజీనామా చేశారు. అప్పట్లో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా మాధవ నాయుడ్ని వీసీ నియమించారు. ఆ మరుసటిరోజు రెక్టార్ ఆచార్య అనురాధ కూడా రాజీనామా చేశారు. ఆమె స్థానంలో కొత్త రెక్టార్ నియామకం ఇంకా జరగలేదు. వీసీ మధుజ్యోతి కూడా రాజీనామా చేస్తారన్న ప్రచారం కొద్దిరోజులుగా జరుగుతూ ఉంది. కొనసాగడానికి ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అందరిలాగే ఆమె కూడా రాజీనామా సమర్పించారని తెలుస్తోంది. వీసీగా స్వల్పకాలమే మధుజ్యోతి బాధ్యతల్లో ఉన్నారు. 8 నెలలుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె చేస్తూ పలుమార్లు వీసీని కలిసి తమకు జీతాలు ఇవ్వాలని కోరినా ఆమె స్పందించలేదనే విమర్శలు ఉన్నాయి.

మాట నిలబెట్టుకున్న సీఎం

- పెంచిన పింఛన్లు 1న పంపిణీ
- లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందించేలా ఏర్పాట్లు
- జిల్లాలో 271,693 మందికి.. సర్టిఫికెట్లు అందజేత



చిత్తూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన మాటను చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక నిలబెట్టుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పింఛను సొమ్మును ఒకేసారి రూ.వెయ్యి పెంచి రూ.4 వేలుగా అందిస్తామని, ఏప్రిల్ నుంచే అమలు చేస్తూ మూడు నెలల బకాయిలనూ కలిపి జూలై ఒకటో తేదీన రూ.7 వేలు అందిస్తామని చెప్పారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక తొలి నెలలోనే పెంచిన పింఛన్లను పంపిణీ చేయనున్నారు. సచివాలయ ఉద్యోగులు జూలై 1న లబ్ధిదారుల ఇళ్ల వద్దే పింఛన్లను పంపిణీ చేయాలని ఇటీవల మంత్రిమండలి నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఆ మేరకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కొందరికి రెండింతలు, ఇంకొందరికి మూడింతలు

చిత్తూరు జిల్లాలో 271,693మంది, తిరుపతి జిల్లాలో 269,158మంది అన్నిరకాల పింఛనుదారులు ఉన్నారు. వృద్ధులు, వితంతువులు, చేనేత, ఒంటరి మహిళలు, కల్లు గీత కార్మికులు, డప్పు కళాకారులు, హెచ్ఐవీ బాధితులు, హిజ్రాలు, కళాకారులకు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచారు. దీంతో పాటు మూడు నెలల బకాయిలు కలిపి వీరికి రూ.7 వేలు అందించనున్నారు. దివ్యాంగులకు, కుష్ఠు, వైకల్యం ఉన్నవారికి రూ.3 వేల నుంచి రెండు రెట్లు పెంచి ఏకంగా రూ.6 వేలు ఇవ్వనున్నారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి, డయాలసిస్ ఇతరత్రా బాధితులకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు అందజేస్తారు. పక్షపాతంతో మంచానికే పరిమితమైన వారికి రూ.5 వేల నుంచి మూడు రెట్లు పెంచి రూ.15 వేలు ఇవ్వనున్నారు. పెంచిన పింఛన్లను లబ్ధిదారుల ఇళ్ల వద్దే పంపిణీ చేసేందుకు ఆయా జిల్లాల అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. వలంటీర్లతో కాకుండా సచివాలయ సిబ్బందితో పంపిణీ పూర్తి చేయనున్నారు.

లబ్ధిదారులకు సర్టిఫికెట్ల పంపిణీ

పింఛను పెంచినట్లు సాక్ష్యంగా లబ్ధిదారులకు ప్రభుత్వం 'పెన్షన్ డిస్‌బర్స్‌మెంట్ సర్టిఫికెట్'ను అందించనుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం విడుదల చేసింది.చిత్తూరు జిల్లాలో 271,693మంది, తిరుపతి జిల్లాలో 269,158పింఛనుదారులు ఉన్నారు. సర్టిఫికెట్ల ముద్రణకుగాను ఒక్కో లబ్ధిదారుడికి 50 పైసలు చొప్పున చిత్తూరు జిల్లాకు రూ.1,36,005, తిరుపతి జిల్లాకు రూ.1,34,753 చొప్పున కేటాయించింది.

రెస్కోలో అక్రమ నియామకాలు వాస్తవం

- అడ్డగోలు పదోన్నతులు కూడా
- అధిక ధరలకు మెటీరియల్ కొనుగోలు
- జేసీ శ్రీనివాసులు నిర్ధారణ
- పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతల స్వీకరణ
- ఆడిట్ విచారణకు త్వరలోనే ప్రత్యేకాధికారి నియామకం

కుప్పం, జూన్ 28: కుప్పం రెస్కో (గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ)లో అక్రమాలు, అవతకతవకలు జరిగిన మాట వాస్తవమేనని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు నిర్ధారించారు. రెస్కో పర్సన్ ఇన్‌ఛార్జిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయన, సంస్థలో అక్రమ నియామకాలు, అడ్డగోలు పదోన్నతులతో పాటు అధిక ధరలకు మెటీరియల్ కొనుగోళ్లు కూడా జరిగాయని తమ ప్రాథమిక పరిశీలనలో తేలిందని స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన రెస్కో అధికారులు, రెగ్యులర్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఇతర సిబ్బందితో సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రెస్కో పూర్తిగా అవినీతి, అక్రమాల మయమైపోయిందన్నారు. అక్రమ నియామకాలు, ఇతర అవినీతి చర్యలపై తమకు అందిన ఫిర్యాదుల మేరకు ప్రాథమిక విచారణ పూర్తి చేశామని చెప్పారు. గతంలో ఈ సంస్థలో 127 మంది ఉద్యోగులు మాత్రమే విధులు నిర్వహించేవారని గుర్తు చేశారు. ఈ ఐదేళ్లలో ఆ సంఖ్య ఏకంగా 227కు పెరిగిపోయిందన్నారు. సుమారు 120 మంది నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు పొందారని ప్రాథమిక విచారణలో తేలిందని వివరించారు. వీరి నియామకాలలో అధికారులు నిబంధనలు పాటించలేదన్నారు. ఇష్టారాజ్యంగా నియామకాలు చేపట్టడంతో వారి వేతనాలు సంస్థకు భారంగా తయారయ్యాయని, ఇక్కడున్న పనికి మించి ఉద్యోగులు చేరిపోయారని వివరించారు. రెస్కోలో ఇలా నిబంధనలు అధిగమించి ఉద్యోగాలు పొందిన వారు ఎంతమంది అనేది విచారణలో తేలుస్తామన్నారు. ఉద్యోగులు, అధికారుల పదోన్నతుల విషయంలోనూ ఎటువంటి ప్రమాణాలు, నిబంధనలు, సీనియారిటీ పాటించలేదని స్పష్టంచేశారు. వేతనాలు కూడా పరిమితికి మించి పొందుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇక మెటీరియల్‌నూ అధిక ధరలు చెల్లించి కొనుగోళ్లు చేయడంలో అవినీతి చోటుచేసుకుందని చెప్పారు. ఇక, రెస్కో ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. వివిధ ప్రభుత్వ సంస్థలనుంచి రూ.100 కోట్లు, ఇతరత్రా మరో 48 కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోయాయన్నారు. ఖర్చులు, కొనుగోళ్ల వేతనాల లెక్కలు తేల్చి ఆడిట్ చేయడానికి త్వరలోనే ఒక ఒక విచారణాధికారిని నియమిస్తామని చెప్పారు. అన్ని లెక్కలు, నియామకాల గురించి తేలిన తర్వాత ఉన్నతాధికారులకు సమగ్ర నివేదిక సమర్పిస్తామని జేసీ శ్రీనివాసులు తెలిపారు. ఆ తర్వాత మాత్రమే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రెస్కో ఎండీ ప్రభాకర్, ఏడీఈ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



రెస్కో పర్సన్ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు తీసుకున్నాక ఉద్యోగులతో సమావేశమైన జేసీ శ్రీనివాసులు

రెస్కోలో ఏఆర్ విచారణ : కుప్పం రెస్కోలో సహకార సంస్థ)లో వైసీపీ హయాంలో జరిగిన అవకతవకలపై కో ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. కార్యాలయానికి చేరుకున్న ఆయన అక్రమ నియామకాలపై ప్రధానంగా దృష్టి సారించారు. ఆరు నెలల కిందట రెస్కోలో దాదాపు 150 మంది సిబ్బందిని అడ్డగోలుగా నియమించుకున్నట్లు తీవ్ర ఆరోపణలున్నాయి. అలా నియమితులైన ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అప్పట్లో ఉంటాయో ఊడతాయో తెలియని ఈ ఉద్యోగాలకు అటు పాలకులకు, ఇటు అధికారులకు కూడా లక్షల్లో ముడుపులు ముట్టాయన్న ఆరోపణలూ ఉండనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ అక్రమ నియామకాలకు సంబంధించిన కొన్ని కీలకమైన ఫైళ్లను తన వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది.

బాలాజీ సూపర్ బజార్‌లో తనిఖీలు

ఇన్‌చార్జిగా ప్రసాద్ నియామకం

పలమనేరు, జూన్ 28: పలమనేరులోని డి.బాలాజీ కో ఆపరేటివ్ సూపర్ బజార్‌లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు జరిగాయి. జిల్లా సహకార శాఖ అధికారిణి వనజ మధ్యాహ్నం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. క్యాష్‌బుక్ రెండు రోజులు రాయకపోవడాన్ని గుర్తించారు. దీనిపై మేనేజర్ బాలును ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం ఆర్డీవో మనోజ్‌రెడ్డి కూడా సూపర్ బజార్‌ను సందర్శించి వ్యాపారలావాదేవీల గురించి ఆరా తీశారు. కాగా సూపర్ బజార్‌కు ఎన్నికలు జరిగి దాదాపు ఆరేళ్లకు పైబడింది. సూపర్ బజార్ అధ్యక్షుడిగా వైసీపీ నాయకుడు ఆర్.వి.సుభాష్‌చంద్రబోస్ కొనసాగుతున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో త్వరలోనే సూపర్ బజార్‌కు ఎన్నికలు నిర్వహిస్తారని ప్రచారం జరుగుతోంది.



సూపర్‌బజార్‌లో రికార్డులను పరిశీలిస్తున్న వనజ

సూపర్ బజార్ ఇన్‌చార్జిగా ప్రసాద్

ఇలా ఉండగా బాలాజి కోఆపరేటివ్ సూపర్ బజార్‌కు ఇన్‌చార్జిగా జిల్లా కో ఆపరేటివ్ కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న టి.ప్రసాద్‌ను నియమించినట్లు తెలిసింది. శుక్రవారం మధ్యాహ్నం కో ఆపరేటివ్ అధికారిణి వనజ ఆకస్మికంగా తనిఖీ చేసిన తర్వాత సాయంత్రానికల్లా ఈయన్ను నియమించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థికి అభినందలను


కవితకు లాప్‌ట్యాప్ అందజేస్తున్న రాజస్థాన్ ఎంపీ బంబారామ్‌చౌదరి

పుంగనూరు రూరల్, జూన్28: రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించడంతో రాజస్థాన్ ఎంపీ బంబారామ్‌చౌదరి, ఎమ్మెల్యే జోగిశ్వర్‌భర్గ్‌లు లాప్‌ట్యాప్ అందించి సన్మానించారు. పుంగనూరులో భవాని ఫ్యాన్సీస్టోర్ నిర్వహకుడి కుమార్తె కవిత ఇక్కడి రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమీ పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో 600 మార్కులను గాను 590 మార్కులు సాధించింది. దీంతో బుధవారం రాజస్థాన్ రాష్ట్రంలోని ప్రజాప్రతినిధులు అభినందించినట్లు పాఠశాల డైరెక్టర్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

అమర్‌ను కలిసిన మున్సిపల్ అధికారులు



పలమనేరు, జూన్28 : పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శుక్రవారం పలమనేరు మున్సిపల్ అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అంద జేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, రెవెన్యూ ఆఫీసర్ రవిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


జడ్జి శ్రీనివాసరావు

పలమనేరు, జూన్28 : పలమనేరులో ఈ నెల 29వ తేదీ శనివారం పలమనేరు సీనియర్ సివిల్ కోర్టులో జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి పగడాల శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేందుకు పోలీసు అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు సహకరించాలన్నారు.

ఇద్దరు అధికారులకు సాదర వీడ్కోలు


ఎంపీడీఓ విద్యాసాగర్, ఆర్డీ గిరిధర్ దంపతులను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

పలమనేరు, జూన్28 : ప్రభుత్వ ఉద్యోగులుగా మూడు దశాబ్దాలకు పైగా పనిచేసి శుక్రవారం ఉద్యోగ విరమణ చేసిన పలమనేరు ఎంపీడీవో విద్యాసాగర్ దంపతులను, పీఆర్‌ఆర్డీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన ఎఎస్ గిరిధర్ దంపతులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. పలమనేరు ఏవీసీ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలోవారిని పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల నుంచి వచ్చిన అధికారులు, ఏపీఎన్జీఓ సంఘ నాయకులు ఆనందబాబు తదితరులు ప్రశంసించారు. శాలువలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు, జూన్28: ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ప్రభుత్వ బడుల్లో చేరేలా వారి తల్లిదండ్రులతో మాట్లాడాలని ఎంఈవోలు లీలారాణి, బాల సుందరం హెచ్‌ఎంలకు, టీచర్లకు సూచించారు. శుక్రవారం మండలంలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు.

నక్కబండలో లోపించిన పారిశుధ్యం



పుంగనూరు రూరల్, జూన్28: పట్టణ సమీపంలోని నక్కబండలో పారిశుధ్యం లోపించింది. మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తూ దోమలకు అడ్డాగా మారింది. ఇళ్లలోని వ్యర్థపునీటితో పాటు కొద్దిపాటి వర్షం కురిస్తే వీధుల్లో నీరు నిలిచిపోతోంది. ఆ నీరు మురుగునీరుగా మారి దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులకు తెలియజేసినా ఫలితం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్, సచివాలయ సిబ్బంది స్పందించి వీధుల్లో మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, టీచర్లు, ఎంఈవోలు

పుంగనూరు రూరల్, జూన్28: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని జిల్లా సమగ్రశిక్ష అధికారి అజయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఇస్లాంనగర్, నక్కబండ ప్రాంతాల్లో పర్యటించి బడిఈడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించినట్లు తెలిపారు. చదువుకునే వయస్సులో పనులకు పంపరాదని, ప్రతి ఒక్కరూ చదువుకోవాలని కోరారు. చదువుతోనే ఉన్నతస్థాయికి చేరవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు

చౌడేపల్లె, జూన్28: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి రాహుకాలంలో పంచామృతాభిషేకాల నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాలపూజలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు తీసుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో చంద్రమౌళి భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



శాంతిపురం, జూన్ 28: మండల పరిధిలోని రాళ్లబూదుగురు పెద్ద చెరువు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పంచాయతీ కార్యదర్శి వనితా రెడ్డి శుక్రవారం సీజ్ చేశారు. పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఇంటి వద్దకే పింఛన్లు

శాంతిపురం, జూన్ 28: శాంతిపురం మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు జూన్ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటి వద్దకే అందిస్తామని ఎంపీడీవో మైథిలి తెలిపారు.

విశాఖ నిందితుడి అరెస్టు



పలమనేరు, జూన్28 : పలమనేరు పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయం కేసుకు సంబంధించి పరారీలో ఉన్న విశాఖకు చెందిన నిందితుడిని అరెస్టుచేసినట్లు పలమనేరు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. విశాఖ పట్టణానికి చెందిన ఎస్.కాశీనాథ్ అలియాస్ కాశి శుక్రవారం తిరుపతి-చిత్తూరు రహదారిలో కాణిపాకం క్రాస్ వద్ద ఉండగా అరెస్టు చేశామని పేర్కొన్నారు. కోర్టులో హాజరుపరచగా నిందితుడికి 15రోజుల రిమాండు విధించినట్లు తెలిపారు. కాగా ఈ కేసులో ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేశామని వివరించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అదించాలి


చల్లాబాబుతో మాట్లాడుతున్న డీఎం సుధాకర్

రొంపిచెర్ల,జూన్28: పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజలకు ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని టీడీపీ ఇన్‌చార్జి చల్లారామచంద్రారెడ్డి ఆర్టీసీ పుంగనూరు డిపో డీఎం సుధాకర్‌ను కోరారు. శుక్రవారం రొంపిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డిని ఆయన ఇంటివద్ద కలిశారు. ప్రస్తుతం పుంగనూరు డిపో నుంచి నడుస్తున్న ఆర్టీసీ బస్సుల మార్గాలు, వాటి రాబడులు, తదితర వివరాలు డీఎం సుధాకర్ చల్లాబాబుకు తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఎం సంధ్య, సూపర్‌వైజర్ గంగన్న పాల్గొన్నారు.

అమరావతి నిర్మాణానికి రూ.లక్ష విరాళం



కుప్పం, జూన్ 28: ఆంధ్రప్రదేశ్ రాజ ధాని అమరావతి నిర్మాణకోసం కుప్పం పట్టణానికి చెందిన విశ్రాంత సీఐ జి.రాజేంద్రనాయుడు, జీఎస్. అమరజ్యోతి దంపతులు రూ.1లక్ష విరాళమిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్య టన సందర్భంగా ఈ నెల 26వ తేదీన ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో కలిసి ఆయనకు విరాళానికి సంబంధించిన చెక్కు అందజేశారు. ముఖ్యమంత్రి వారిని అభినందించారు.

సమస్యల పరిష్కారానికి ముందుంటా: అమర్


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూన్28 : పలమనేరు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి తాను ముందుంటానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. పలమనేరు డిపో నుంచి ఆర్టీసీ బస్సులు కుప్పానికి తరలి పోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆర్టీసీ ఉన్నతాధికారులతో పాటు రవాణా శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. గురువారం పలమనేరు డిపో నుంచి కుప్పంకు ఏకంగా 13 బస్సులు తరలిపోవడంపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వార్తపై స్పందిస్తూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి పెద్దిరెడ్డి పుంగనూరులో డిపో ఏర్పాటు చేసిన సందర్భంగా అక్కడికి పలమనేరు డిపోనుంచి బస్సులు తరలించుకు పోయారని పేర్కొన్నారు. ఇక పలమనేరు డిపోకు కుప్పం డిపో నుంచి కొన్ని బస్సులను తరలించారన్నారు. ఇప్పుడు గతంలో కుప్పం డిపో నుంచి పలమనేరు డిపోకు తరలించిన బస్సులను మళ్లీ కుప్పానికి తరలించారని పేర్కొన్నారు. అయితే ప్రజలకు రవాణా సేవల్లో ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక వైసీపీ ప్రభుత్వ హయాంలో పుంగనూరులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌కో డీఈ కార్యాలయం ఒకిరిద్దరికి మినహా ఎవరికీ పెద్దగా ఉపయోగం ఉండదన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు విజయ భాస్కరరెడ్డి, రంగనాథం, కిషోర్‌గౌడు, ఆర్టీసీ కుట్టి, సోమశేఖర్ గౌడు, గిరిబాబు, ఖాజాపీర్, అమరనాథరెడ్డి, జగదీష్‌నాయుడు, రామచంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల వితరణ


మహిళలకు చీరలు అందజేస్తున్న జగన్నాథం

రామకుప్పం, జూన్ 28: రామకుప్పం మండలం బిరుగుండ్లపల్లె ప్రాథమిక పాఠశాలకు టీడీపీ గాండ్ల, తెలికుల సాధికార సమితి రాష్ట్ర సభ్యుడు వేలూరి జగన్నాథం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల చిత్రపటాలు వితరణగా ఇచ్చారు. ఆ ఫొటోలను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మెన్ సీతాపతి పాల్గొన్నారు. ● అదేవిధంగా తన కుమార్తె తేజస్వీని పుట్టినరోజును పురస్కరించుకుని జగన్నాథం, ఆయన తండ్రి మాజీ ఎంపీటీసీ నారాయణశెట్టి విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. గ్రామంలోని పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

ఆగిన అభివృద్ధిని పరుగులు తీయిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఆనందరెడ్డి

రామకుప్పం, జూన్ 28: వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపుతో కుప్పం నియోకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధిని మళ్లీ పరుగులు తీయిద్దామని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్ర నారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మెన్ సీతాపతిలు తెలిపారు. శుక్రవారం రామకుప్పం మండల సచివాలయంలో మండల పరిధిలోని అన్నిశాఖల అధికారుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో అధికారులు, టీడీపీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి సీఎం చంద్రబాబు ఆశయాలకనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దారు శ్రీధర్, ఎంపీడీవో ఈశ్వరన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిపై చంద్రబాబు ప్రత్యేకశ్రద్ధ: టీడీపీ


విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న నాయకులు

రామకుప్పం, జూన్ 28: కుప్పం నియోకవర్గంలో విద్యాభివృద్ధిపై సీఎం చంద్రబాబు ప్రత్యేకశ్రద్ధ చూపారని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మెన్ సీతాపతి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ తెలిపారు. శుక్రవారం రామకుప్పం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వారు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయశ్రీ పాల్గొన్నారు.

ముస్లింలకు వైసీపీ క్షమాపణలు చెప్పాలి: బీజేపీ

పుంగనూరు, జూన్28: ముస్లిం సమాజానికి వైసీపీ బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు అయూబ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు ముస్లిం మతపెద్దలు టీడీపీకి ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్టే, కూటమి అభ్యర్థులకు ఓటు వేయరాదని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేశారని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం లోక్‌సభ స్పీకర్ ఎన్నికలో వైసీపీ ఎంపీలు బీజేపీకి మద్దతు ఇచ్చారని తెలియజేశారు. ఎన్నికల సమయంలో కేవలం ముస్లింల ఓట్ల కోసం బీజేపీపై బురద జల్లిన మాజీ సీఎం జగన్‌ను నాడు ప్రచారం చేసిన ముస్లిం పెద్దలు నిలదీయాలని కోరారు.

పెద్దఉప్పరపల్లెకు రూ.1.32 లక్షల ఆదాయం

సోమల, జూన్ 28: పెద్దఉప్పరపల్లె పంచాయతీ వనరుల వేలం పాటలతో పంచాయతీకి రూ. 1.32 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి తెలిపారు. సంత ద్వారా రూ. 1.21లక్షలు, బస్టాండ్ గేట్ ద్వారా రూ.11 వేలు ఆదాయం వచ్చినట్లు వివరించారు. రైతులకు సంబంధించిన కూరగాయల అమ్మకాల గేటు వసూళ్లు అధికంగా చేయరాదని, సంత స్థలంలో తాగునీటి సౌకర్యం కల్పించాలని కార్యదర్శి మసూదబేగం కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన అవసరం

సోమల, జూన్ 28: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని పెద్ద ఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. శుక్రవారం పెద్దఉప్పరపల్లె పీహెచ్‌సీ పరిధిలోని ఆవులపల్లెలో పరిసరాల శుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. వర్షాలతో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అతిసార వ్యాధి నివారణకు సంబంధించి పలు సూచనలు చేశారు. అలాగే పట్రపల్లె, పేటూరు, కొత్తూరుల్లో పర్యటించి పలు సూచనలు చేశారు. ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మెనూ పాటించాలి


ఇరికిపెంట బడిలో వంట నిర్వాహకుల సమావేశం

సోమల, జూన్ 28: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వండాలని ఎంఈవో శివరత్న నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం ఇరికిపెంట పాఠశాలలో జరిగిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బడి మానేసిన విద్యార్థులను మళ్లీ పాఠశాలల్లో చేర్చాలని కోరారు. అలాగే సోమల, ఎర్రనాగులపల్లె, మేటిమంద తదితర పాఠశాల ల్లో రికార్డులను పరిశీలించారు. ఈ సమావేశాల్లో హెచ్‌ఎంలు శోభారాణి, ఎల్లయ్య, లత, రాజేశ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి పనిఒత్తిడి తగ్గించాలి: సీఐటీయూ


ఆర్టీసీ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పుంగనూరు, జూన్28: ఆర్టీసీని బలోపేతం చేసి సంస్థలో పనిచేస్తున్న సిబ్బందికి పని ఒత్తిడిని తగ్గించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంగరాజు, ఆర్టీసీ జోనల్ కార్యదర్శి భాస్కర్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదం వల్ల ఆర్టీసీ నష్టాల్లోకి వెళ్లిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సంస్థను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థలో పని చేస్తున్న సిబ్బంది అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నా అధికారులు వారిపై పని ఒత్తిడి పెంచుతున్నారని ఆరోపించారు. కాలుష్య నివారణ పేరుతో ఎలక్ట్రికల్ బస్సులు తీసుకురావడం మంచిదే అయినప్పటికీ వాటి నిర్వహణ ఆర్టీసీ సంస్థ నిర్వహించేలా చూడాలని కోరారు.

నూతన కమిటీ ఎంపిక

పుంగనూరు ఆర్టీసీ డిపో పరిధిలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడుగా వాడ గంగరాజు, అధ్యక్షులుగా మమత, కార్యదర్శిగా నాగార్జున, ఉపాధ్యక్షులుగా హరినాథ్, సహాయ కార్యదర్శిగా కేవీ.రెడ్డెమ్మ, కోశాధికారిగా శోభ, ప్రచార కార్యదర్శులుగా ప్రమీల, శిరీషా, ఐదుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

కుప్పంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు

- ఆలయాల ఆభరణాల బాధ్యత కమిటీలదే!
- ఊళ్లకు వెళ్లేవారు సమాచారం ఇవ్వాలి
- రాత్రి 10 తర్వాతే అన్‌లోడింగ్
- కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు



కుప్పం, జూన్ 28: కుప్పంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటానని కుప్పం అర్బన్ సీఐ జీటీ.నాయుడు అన్నారు. రెండు రోజుల క్రితం అర్బన్ సీఐగా బాధ్యతలు తీసుకున్న ఆయన శుక్రవారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. గ్రామాలలోని ఆలయాలలో చోరీలు ఎక్కువగా జరుగుతున్న విషయం గమనించామన్నారు. ఆలయాలలో దేవతా మూర్తులకు ఖరీదైన ఆభరణాలు అలంకరించాక మళ్లీ వాటిని సాయంత్రానికి తిరిగి కమిటీ సభ్యులు లేదా గ్రామ పెద్దలు తీసుకు వెళ్లి భద్రపరచాలని సూచించారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలు అమర్చుకోవాలని చెప్పారు. ఊళ్లకు వెళ్లేవారు ముందుగా సమాచారం ఉండాలన్నారు. దీనివల్ల రాత్రివేళ సంబంధిత ఇళ్ల పరిసరాలలో సెక్యూరిటీ డ్యూటీలో ఉన్న పోలీసులు నిఘా ఉంచుతారన్నారు. ఇక కుప్పంలో ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. సిమెంటు, కమ్మి, హోల్‌సేల్ వ్యాపారులు ఎక్కువగా ఎప్పుడుపడితే అప్పుడు భారీ వాహనాలను నడిరోడ్డుపై నిలిపి లోడింగ్, అన్‌లోడింగ్ చేయరాదని సూచించారు. రాత్రి పది దాటిన తర్వాతే లోడింగ్, అన్ లోడింగ్ చేసుకోవాలని తెలిపారు. పగటిపూట చేస్తే ఆ వాహనాలను సీజ్ చేసి, కేసు నమోదు చేస్తామని స్పష్టంచేశారు. కుప్పంతోపాటు శివారు ప్రాంతాలలో విద్యా సంస్థలు ఉన్న చోట ఆకతాయిలు అమ్మాయిలను టీజింగ్ చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని, అటువంటివారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గంజాయి నివారణకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. కుప్పం పట్టణంలోని బైపాస్ ఓవర్ బ్రిడ్జి కింద, ఇతర బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్నారని, అటువంటివారిని ఉపేక్షించేది లేదని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, సైలెన్సర్ తీసివేసి నడిపినా, చెవులు చిల్లులు పడేలా హారన్లు వేసుకుంటూ అతివేగంగా చక్కర్లు కొట్టే ఆకతాయిలపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

లియో క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవం


అధ్యక్షురాలు అఫీఫా, కార్యదర్శి విజయ, కోశాధికారి హేమ

కల్లూరు, జూన్ 28: కల్లూరు లియో క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి, జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మదలి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్‌క్లబ్ కార్యాలయంలో శుక్రవారం లియో క్లబ్ కార్యవర్గం ఎన్నికలు నిర్వహించగా అన్ని పదవులు ఏకగ్రీవమ య్యాయి. లియో క్లబ్ అధ్యక్షురాలుగా అఫీఫా, కార్య దర్శిగా విజయ, కోశాధికారిగా హేమ, ఉపాధ్యక్షు రాలుగా అవీన, సభ్యత్వ చైర్మన్‌గా నీలావతి తది తర సభ్యులు ఎన్నికయ్యారు. లియో క్లబ్ నూతన కార్యవర్గం ఎంపిక కావడంపై కల్లూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పోకల తాతయ్య, కార్యదర్శి వెంకటసిద్ధులు, కోశాధికారి ప్రకాష్, సభ్యులు రాజేంద్ర, అర్‌ఎన్ రాజన్, సుధాకర్ నాయుడు, రాజారెడ్డి, శ్రీహరిరెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

విరూపాక్షి మారెమ్మకు పప్పు దినుసుల అలంకరణ



పుంగనూరు రూరల్, జూన్ 28: పట్టణంలోని విరూపాక్షిమారెమ్మ శుక్రవారం పప్పు దినుసుల అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకుని చీరలు, రవికెలు మొక్కులుగా చెల్లించారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు.

బీసీ హాస్టల్లో భారీ వృక్షం కూల్చివేత



కుప్పం, జూన్ 28: కుప్పం మునస్వామి పురంలో ఉన్న సాంఘిక సంక్షేమ వెనుకబడిన తరగతుల వసతి గృహం (బాలురు) ఆవరణలో ఉన్న భారీ వృక్షాన్ని శుక్ర వారం కొంతమంది కూల్చివేశారు. చెట్ల కొమ్మలను నరికి నేలమట్టం చేయడానికి యత్నించారు. వారిని స్థానికులు అడ్డుకున్నారు. అయితే ఆ చెట్టు కూల్చడానికి 2022లోనే తమకు అధికారులు అనుమతి ఇచ్చారంటూ అనుమతి పత్రాన్ని చూపారు. హాస్టల్ భవనం, ప్రహరీ కూలే పరిస్థితి ఉన్నందున బీసీ హాస్టల్‌లోని మూడు చెట్లను కూల్చడానికి అనుమతిస్తున్నట్లు రెవెన్యూ, అటవీ శాఖాధికారులు ఇచ్చిన అనుమతి రాతలున్నాయి. మిగిలిన రెండు చెట్లను గతంలోనే కూల్చివేసిన కాంట్రాక్టుదారులు, మిగిలిన ఒక్క చెట్టును ఇన్నాళ్ల తర్వాత కూల్చడానికి వచ్చారు. అయితే అనుమతి ఉత్తర్వుల్లో ఉన్నట్లు ఇప్పుడున్న కూల్చిన చెట్టువల్ల కానీ, గతంలో కూల్చిన రెండు చెట్ల వల్ల కానీ భవనానికి లేదా ప్రహరీకి వచ్చే ఇబ్బందేమీ లేదు. అవి ప్రహరీని ఆనుకుని రోడ్డువారగా ఉన్నాయి. అయినా అప్పట్లో అధికారులు అలా అనుమతినివ్వడంపట్ల టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకుల లబ్ధికోసమే చెట్లను అప్పనంగా కూల్చివేయడానికి అనుమతులిచ్చారని ఆరోపిస్తున్నారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, జూన్28: పుదిపట్లలో వెలసిన వైష్ణవిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం వైవిష్ణవిదేవికి ఆలయ అర్చకులు పంచామృతాభిషేకం నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అలాగే నాగభైరవస్వామి, ఆంజనేయ స్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వినోద్, కుమార్‌రెడ్డి, శ్రావణిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



దిల్ రుబా ఆఖరి కళాకారుడు శ్రీనివాసరావు మృతి

వెంకటగిరి టౌన్, జూన్ 28 : వెంకటగిరికి చెందిన అరుదైన దిల్‌రుబా వాయిద్య కళాకారుడు శ్రీనివాసరావు కన్నుమూశారు. ఆయన వయసు 104 సంవత్సరాలు. రాయదుర్గంలోని తన మేనల్లుడు డాక్టర్ గోపాల్ వద్ద కొంతకాలంగా ఉంటున్న శ్రీనివాసరావు గురువారం రాత్రి ఆఖరిశ్వాస విడిచారు. హిందుస్థానీ వాయిద్యం అయిన దిల్‌రుబా మీద కర్ణాటక సంగీతాన్ని పలికించడం శ్రీనివాసరావు ప్రత్యేకత. ఉత్తర భారతదేశంలోనే అరుదైన ఈ సంగీత వాయిద్యాన్ని దక్షిణభారతదేశంలో వాయించే ఆఖరి కళాకారుడు ఈయన. వయోలిన్, జలతరంగిణి, హార్మోనియం, కీ-బోర్డు ల్లోనూ శ్రీనివాసరావు దిట్ట. 1933 నుంచి వెంకటగిరిలోని అమెచ్యూర్ ఆర్టిస్ట్ అసోసియేషన్, వెంకటగిరి ఆర్ట్స్ థియేటర్, కల్చరల్ ఆర్ట్ థియేటర్స్, నట సమాఖ్య, ఆజాద్ అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ వంటి సంస్థల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. 1940-50 మధ్య వెంకటగిరి క్లబ్ కార్యదర్శిగా పది సంవత్సరాలు సేవలందించారు. పంచాయతీ బోర్డు సభ్యుడిగానూ పనిచేశారు. ఎస్వీబీసీ మాజీ ఛైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధారకు హార్మోనియం సహకారం అందించారు.ఆచార్య ఆత్రేయతో మంచి సాన్నిహిత్యం ఉండేది. శ్రీనివాసరావు సంగీతమే ఊపిరిగా జీవించారు. పెళ్లి చేసుకోలేదు. కొన్నేళ్లుగా మేనల్లుడి వద్ద ఉంటూ గురువారం కన్నుమూశారు.


తిరుమల ఘాట్‌లో కలకలం



ఏనుగుల సంచారంతో శుక్రవారం సాయంత్రం తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో కలకలం రేగింది. ఏడవమైలు వద్ద 10ఏనుగులతో పాటు 3గున్న ఏనుగులు రోడ్డు సమీపానికి రావడం గమనించిన యాత్రికులు హడలిపోయారు.టీటీడీ ఫారెస్ట్ సిబ్బంది శబ్దాలు చేయడంతో 20 నిమిషాల తర్వాత ఏనుగులు అడవిలోకి వెళ్లిపోయాయి.మళ్లీ రాత్రి 8-9గంటల నడుమ మరోసారి ఏనుగుల గుంపు రోడ్డు సమీపానికి రాగా అడవిలోకి తరిమి వేసినట్లు అధికారులు తెలిపారు.



- తిరుమల, ఆంధ్రజ్యోతి



రంగు చెత్తబుట్టలేం చేయాలబ్బా?



వారం కిందట పాలసముద్రం ఎంపీడీవో ఆఫీసులో దిగిన చెత్త బుట్టల లోడ్‌ను చూసిన అధికారులు అయోమయంలో పడ్డారు. స్వచ్ఛభారత్ కింద ఇంటింటికీ పంపిణీ చేసేందుకు 9000 చెత్తబుట్టల ఆర్డర్‌ను ఎన్నికలకు ముందు ఒక ఫ్యాక్టరీకి అప్పగించారు. వైసీపీ ప్రభుత్వంలో రంగు పిచ్చి ఎక్కువ కాబట్టి చెత్తబుట్టలను కూడా పచ్చ, నీలం రంగుల్లో తయారు చేయించారు. తీరా ఎన్నికలయ్యాక ఇవి దిగాయి. ఇప్పుడీ రంగు చెత్తబుట్టల్ని పంచడం ఎలాగబ్బా అని అధికారులు అయోమయంలో ఉన్నారు. పంచకపోతే నష్టం. పంచితే నాయకులు ఏమంటారో అనే భయం. చూడాలి ఏం చేస్తారో మరి!

- పాలసముద్రం

పూర్తి అంగవైకల్యమున్నా పింఛను తీసేశారు

- పొలం ఉందంటూ తొలగింపు
- 34 ఏళ్లు వచ్చినా తల్లి లాలనలోనే
- వైద్యం ఖర్చులు అందించాలని ప్రభుత్వానికి గ్రామస్థుల వేడుకోలు

ఐరాల, జూన్ 28: శరీరంలో ఏ అవయమూ పనిచేయదు. 34 ఏళ్లు వచ్చినా చంటిబిడ్డలా చూసుకుంటోందా తల్లి. ఇతడి ఆలనా పాలనకు రోజూ ఇద్దరు మనుషులు కావాలి. ఇక, ఆస్పత్రిలో వైద్యం ఖర్చు ఏటా రూ.లక్షల్లోనే. అలాంటి ఇతడికి వైసీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా పింఛను తీసేసింది. ఇతడి తల్లిదండ్రుల పేరిట 18 ఎకరాల పొలం ఉందని తొలగించేసింది. పొలమున్నా సేద్యం చేయక.. డబ్బు రాక ఇబ్బంది పడుతున్నామని చెప్పినా పట్టించుకోలేదు. వివరాలిలా ఉన్నాయి. ఐరాల మండలం నాంపల్లె రెవెన్యూ మిరియంగంగనపల్లెకు చెందిన సోమశేఖర్‌నాయుడు, సరస్వతమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమారుడు తులసీరామ్ పుట్టుకతోనే పూర్తి స్థాయి అంగ వైకల్యంతో జన్మించాడు. కొంత కాలానికి తండ్రి మృతి చెందాడు. అప్పట్నుంచి తల్లే అతడికి అన్నీ అయ్యి చూసుకుంటోంది. అతడి ఆలనా పాలనకు ఇద్దరు మనుషుల అవసరం ఉంటుంది. అతడికి ద్రవరూపంలో పైపు ద్వారా భోజనం అందిస్తారు. ఆ యువకుడిని అంగ వైకల్యంతో పాటు ఊపిరితిత్తుల సమస్య వెంటాడుతోంది. ఈ క్రమంలో అతడిని ఆస్పత్రిలో చూపించడానికి వెళ్లిన ప్రతి సారి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చయేది. అలా ఏడాదిలో మూడు నుంచి నాలుగు సార్లు తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇక, ప్రతి నెలా మందుల ఖర్చుగా రూ.15,000 వరకు ఖర్చవుతోంది. టీడీపీ హయాంలో ఈ యువకుడికి పూర్తి అంగవైకల్యం కింద పింఛను ఇచ్చేవారు. ఈ పింఛను డబ్బు మందుల ఖర్చుకు కొంతవరకు ఉపశమనంగా ఉండేది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. 2022 సెప్టెంబరులో నెలలో పింఛను తొలగించింది. ఇతడి తల్లిదండ్రుల పేరిట 18 ఎకరాల పొలం ఉండటాన్ని చూపారు. అయితే, కుటుంబ యజమాని లేకపోవడం, ఆ పొలాన్ని సొంతంగా సాగు చేయలేక ఆర్థికంగానూ ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో పింఛను కొనసాగిస్తే వైద్య ఖర్చులకు కొంతవరకు బాసటగా ఉంటుందని కోరినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా, కొంతకాలం కిందట అతడిని ఆస్పత్రికి తీసుకు రావాల్సిన అవసరం లేదని డాక్టర్లు చెప్పడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. అయినా, ఎంతో సహనంతో అతడిని చూసుకుంటోంది. ప్రస్తుతానికి ఊపిరితిత్తుల సమస్య కొంతవరకు తగ్గి ఆ యువకుడు కొంచెం కుదురుగా ఉన్నాడు. తులసీరామ్ పరిస్థితిని చూసి ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వమైనా అతడి మందుల ఖర్చులకు అవసరమైన డబ్బును పింఛను రూపంలో అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ద్రవ రూపంలో ఫీడింగ్ తీసుకుంటున్న తులసీరామ్

రొంపిచెర్లలో 8 మంది వార్డు మెంబర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేస్తున్న వార్డు సభ్యులు

రొంపిచెర్ల, జూన్ 28: పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల మండలానికి చెందిన 8 మంది వార్డు మెంబర్లు శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారికి రాజీనామా పత్రాలు అందజేశారు. ఇప్పటికే పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్, మరో పది మంది కౌన్సిలర్లు గురువారం వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే మరికొందరు కౌన్సిలర్లతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో రొంపిచెర్ల పంచాయతీకి చెందిన 3, 6, 8 వార్డు మెంబర్లు ఎస్.మస్తాన్, సి.లక్ష్మయ్య, ఎన్.నజీముద్దీన్.. బోడిపాటివారిపల్లె పంచాయతీలో 2, 4, 6 వార్డు మెంబర్లు డి.సరేష్, ఎం.దీప, ఎస్.రెడ్డెమ్మ.. జగడంవారిపల్లె పంచాయతీ మూడో వార్డు మెంబరు ఎస్.బాలాజీ, పెద్దమల్లెల పంచాయతీ మూడవ వార్డు సభ్యుడు ఎన్.ప్రభు కుమార్ శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశామని తెలియజేశారు. ఈ రాజీనామాల వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పలు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), జూన్ 28: తిరుపతి- కాట్పాడి రైల్వేస్టేషన్ల మధ్య రాకపోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్లు జూలై 31వ తేదీవరకు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి తిరుపతి నుంచి కాట్పాడి వరకు రాకపోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్ల(07659-07582)ను రద్దు చేశామన్నారు. అలాగే తిరుపతి- విల్లుపురం మధ్య నడిచే రైళ్ల (16853-16854)ను కూడా జూలై 31వ తేదీవరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చిత్తూరు లీగల్/గుడుపల్లె, జూన్ 28: బాలికపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలానికి చెందిన దేవరాజులు (32), అదే గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదువుకుంటున్న బాలికకు మాయమాటలు చెప్పాడు. గ్రామ సమీపాన గల వంక వద్ద అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండుకు తరలించారు. ఈ కేసు శుక్రవారం పోక్సో కోర్టులో వాయిదా ఉండగా, పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం దేవరాజులుపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పుచెప్పారు. అలాగే, బాలికకు నష్ట పరిహారం కింద రూ.3 లక్షలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,100 మంది తలనీలాలు సమర్పించారు.

చీటింగ్ కేసులో దంపతులకు మూడేళ్ల జైలు

తిరుపతి(లీగల్), జూన్ 28: చెక్ చీటింగ్ కేసులో తిరుపతికి చెందిన దంపతులు కె.శ్రీనివాసులు, కె.ఓంకారలక్ష్మిలకు మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి ఎం.సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదు తరపు న్యాయవాది జి.వెంకటకుమార్ తెలిపిన వివరాల మేరకు.. 2011 ఆగస్టు 14వ తేదీన తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన పి.పురుషోత్తం వద్ద కె.శ్రీనివాసులు, ఓంకారలక్ష్మి దంపతులు రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు చెల్లించే క్రమంలో భార్యపేరుతో ఉన్న చెక్‌పై భర్తసంతకం చేసి పురుషోత్తంకు ఇచ్చారు. సదరు చెక్‌ను బ్యాంకులో డిపాజిట్ చేయగా సంతకం తేడా రావడంతో రిటర్న్ అయింది. ఉద్దేశపూర్వకంగా మోసం చేసినట్లు నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

ఎస్వీయూలో నేడు ఏఐఎస్ఎఫ్ సమావేశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు తిరుపతిలో శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య హాజరు కానున్నారు.

భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించడమే టీటీడీ లక్ష్యమని ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో శుక్రవారం సాయంత్రం జేఈవో వీరబ్రహ్మంతో కలిసి తిరుమలలోని పెద్ద, జనతా హోటళ్లపై సమీక్షించారు. సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ప్రముఖమైన హోటళ్లతో జాబితా రూపొందించడానికి ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకుడు చలేశ్వరరావు, తాజ్ హోటల్స్ జీఎం చౌదరి సూచనలను ఆహ్వానించినట్టు తెలిపారు. దీనికిముందు తిరుమల ఎస్టేట్స్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలోని హోటళ్ల గురించి వివరించారు. అలాగే ఐటీ విభాగం భక్తులకు అందిస్తున్న వివిధ సేవల గురించి జియో బృందంతో ఈవో సమీక్షించారు. అనంతరం ఆలయ సిబ్బంది, పోటు కార్మికులతో సేంద్రియ ప్రసాదాలపై సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఐజీ మేనేజర్ నాదముని, జియో సంస్థ ప్రతినిధులు మోషిన్ అబ్బాస్, విజయ్‌కుమార్, మంజీత్, పోటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనంలో తనిఖీలు

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం తనిఖీలు చేశారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలను స్వయంగా పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. స్వయంగా కొన్ని అన్నప్రసాదాల రుచిని పరిశీలించారు. భక్తుల సూచన మేరకు అన్నప్రసాదాలను మరింత రుచిగా అందించాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు.



జేఈవోతో మాట్లాడుతున్న శ్యామలరావు

డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పీఐసీగా జేసీ బాధ్యతల స్వీకరణ

- 25 విండోలకు అధికారుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 28: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ), చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(సీడీసీఎంఎస్)లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ రెండు సహకార సంఘాలకు పీఐసీగా ప్రభుత్వం జేసీని నియమించిన విషయం తెలిసిందే. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీవో నాగవర్ధన్, సీఈవో మనోహర్ గౌడ్, బిజినెస్ మేనేజర్ శ్రీధర్‌నాయుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదివరకు వీటికి సెవన్‌మెన్ నాన్ అఫిషియల్ కమిటీలు ఉండగా కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో కమిటీలు తమ పదవులకు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. జేసీ శ్రీనివాసులు ఈ పదవిలో ఆరు నెలల పాటు లేదా పాలకవర్గ ఎన్నికలయ్యేంత వరకు కొనసాగుతారు. కాగా, 25 విండోలకు సంబంధించి అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జులుగా డీసీవో నాగవర్ధన, సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్లను నియమించగా వారు బాధ్యతలు స్వీకరించారు. వీరు ఈ ఏడాది డిసెంబరు 20వ తేదీ వరకు పదవిలో కొనసాగుతారు.

ముగిసిన చిరుధాన్యాల పరిశోధన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న తిలక్‌రాజ్ శర్మ

తిరుపతిరూరల్, జూన్ 28: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన సదస్సు శుక్రవారంతో ముగిసింది. దీనిలో భాగంగా చిరుధాన్య పంటల ఉత్పాదకత పెంపు, ఆహార, పోషక భద్రత సాధించే దిశగా గత ఏడాదిలో చిరుధాన్య పంటల్లో చేపట్టిన పరిశోధనా ఫలితాలని విశ్లేషించి.. ఈసంవత్సరం చేపట్టాల్సిన కార్యాచరణపై విపులంగా చర్చించారు. అలాగే చిరుధాన్య పంట రకాల ఎంపిక కోసం ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ ఆధ్వర్యంలో వీఐసీ సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ వాతావరణ వ్యవసాయ మండలాల్లో చీడపీడలని తట్టుకుని అధిక దిగుబడితోపాటు అధిక పోషక విలువలు కలిగిన రకాలు, వంగడాలను సాగుకు సిఫారసు చేసినట్లు ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి వివరించారు. రూట్ అండ్ రైజోస్ఫేర్ ఇంజనీరింగ్ ఫర్ డెవలప్పింగ్ క్లైమేట్ రీసిలియెంట్ క్రాప్స్‌పై తిరుపతి ఐసర్ అధ్యాపకుడు డాక్టర్ ఈశ్వరరామిరెడ్డి ఉపన్యసించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీసత్యనారాయణ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, ఎస్వీ వ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ రమణ, ఐసీఎంఆర్ సిబ్బంది, వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధకులు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి

జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు

తిరుపతిరూరల్, జూన్ 28: పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్(కాబి) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విస్తరణ అధికారులకు సాగులో డిజిటల్ యాప్‌లు, ఆన్‌లైన్ కోర్సులపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాబి యాప్స్ కోర్సులు చాలా ఉపయుక్తంగా ఉంటాయని, ఈ శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీరికి శిక్షణను దక్షిణ ఆసియా కోఆర్డినేటర్ మధు మంజరి ఇచ్చారు. వ్యవసాయశాఖ జిల్లా వనరులకేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య, డివిజన్ వ్యవసాయ అధికారులు, గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులు, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏవోలు శశికళ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో టీటీఐల తనిఖీలు



రేణిగుంట రైల్వేకోర్టులో లైసెన్స్ లేని హాకర్లను హాజరు పరిచిన అధికారులు

తిరుపతి(సెంట్రల్), జూన్ 28: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలో శుక్రవారం పలు రైల్వేస్టేషన్లలో టీటీఐలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వేకు అపరాధ రుసుం రూపంలో రూ.3.03 లక్షలు వసూలు చేసినట్లు డివిజన్ కమర్షియల్ మేనేజరు సోమశేఖర్ నాయుడు తెలిపారు. అలాగే ఎనిమిది మంది హాకర్లను రేణిగుంట రైల్వేకోర్టుకు హాజరు పరిచామన్నారు. రైల్వే స్టేషన్లలో మెడికల్ కార్డులు లేని అనధికార హాకర్లు వస్తు విక్రయాలు చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రేణిగుంట- కడప- గూడూరు- కాట్పాడి మార్గాల్లో ఉన్న ప్రధాన రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. 605 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఏసీఎం ధనంజయకుమార్ సింగ్, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వి.రావు, కె.సుధాకర్‌లతోపాటు 36 మంది స్క్వాడ్ టీటీఐలు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మృత్యు మలుపులు


ప్రమాదకరంగా ఉన్న పాపసముద్రం మలుపు

గుడిపాల, జూన్ 28: మండలంలోని గుడిపాల క్రాస్ చిత్తపార రహదారిలో ప్రమాదకరమైన మలుపులున్నాయి. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు వికలాంగులయ్యారు. తుమ్మలవారిపల్లె, గుడిపాల అరుంధతివాడ, పాపసముద్రం, పిళ్లారికుప్పం, బండపల్లె, చిత్తపార మలుపుల వద్ద పిచ్చిమొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. సూచికబోర్డులు లేకపోవడంతో వాహనదారులు వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి మలుపుల వద్ద మొక్కలను తొలగించడమే గాక సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇన్‌చార్జి ఎస్‌ఐగా నరేంద్రకుమార్



గుడిపాల, జూన్ 28: గుడిపాల ఇన్‌చార్జి ఎస్‌ఐగా నరేంద్రకుమార్ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసున్న ఎస్‌ఐ శ్రీనివాసరావును ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఆ పోస్టుకు చిత్తూరు ఒన్‌టౌన్ ఎస్‌ఐగా ఉన్న నరేంద్రకుమార్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి


నిరసన తెలుపుతున్న దళితులు

గుడిపాల, జూన్ 28: దళితులపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని మండలంలోని పెరుమాళ్లకుప్పం దళితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం గుడిపాల పోలీసు స్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు గజేంద్ర మాట్లాడుతూ ఈనెల 16న పెరుమాళ్లకుప్పంలో రాజగోపాల్ కుటుంబ సభ్యులపై అదే గ్రామానికి చెందిన అగ్ర కులస్థులు దాడి చేసి, కులం పేరుతో దూషించారని తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా వదిలేశారన్నారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని కొత్త ఎస్‌ఐ నరేంద్రకుమార్ హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించారు.

బోగస్ పింఛన్లను తొలగించండి

గుడిపాల, జూన్ 28: గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు ఫోర్జరీ సర్టిఫికెట్లతో కొంతమందికి పింఛన్లు మంజూరు చేశారని, విచారించి తొలగించాలని టీడీపీ మండల మాజీ అధికార ప్రతినిధి తుమ్మల సాంబశివనాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌లు డిమాండ్ చేశారు. వైసీపీ నేతల ఆధ్వర్యంలో వందల కొద్దీ బోగస్ పింఛన్లను మంజూరు చేసుకున్నారని ఆరోపించారు.

పాఠశాలల్లో ఆయాలను కొనసాగించాలి


నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 28: పాఠశాలల్లో ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించి, వారి సేవలను కొనసాగించాలని ఏఐటీయూసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో కార్యాలయం ముందు ఆ సంఘం నాయకులు, ఆయాలు నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జయకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, గౌరవాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం తొలగించిన ఆయాలను కొనసాగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలను ఇప్పించాలని కోరారు. కార్మికులకు మాస్కులు, చెప్పులు, గ్లౌసులు ఇవ్వాలన్నారు. డీఈవో దేవరాజుకు వినతిపత్రం సమర్పించారు.

రేపు విజయపురం మండల సమావేశం

విజయపురం, జూన్ 28: మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ జమున అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో బ్రహ్మయ్య తెలిపారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరయ్యే ఈ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

మహారాజపురంలో ఎమ్మెల్యే పర్యటన

విజయపురం, జూన్ 28: మండలంలోని మహారాజపురంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం పర్యటించారు. ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దళితవాడలో శరత్ గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి చినబాబు, మండలాధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, పురుషోత్తం, వెంకటేష్ యాదవ్, లోకేష్‌రాజు, డీఎస్‌రాజు, కాటయ్య పాల్గొన్నారు.

జోరుగా పారిశుధ్య పనులు


బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

విజయపురం, జూన్ 28: మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టారు. సామిరెడ్డి కండ్రిగ, పన్నూరు, విజయపురం, జగన్నాథపురం, కోసలనగరం గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది డ్రైనేజీలు, రోడ్లపై చెత్తను తొలగించారు. బ్లీచింగ్ చేశారు. ఈవోపీఆర్డీ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చేందుకు కాలినడకన తిరుమలకు..



కార్వేటినగరం, జూన్ 28: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సీఎం అయితే కాలి నడకన తిరుమలకు వస్తానని మండలంలోని కేఎం పురం పంచాయతీ మాజీ సర్పంచ్ సోమశేఖర్‌యాదవ్ మొక్కుకున్నారు. ఆయన కోరిక నెరవేరడంతో శుక్రవారం కాలినడకన తిరుమలకు చేరుకుని మొక్కు తీర్చుకున్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



కార్వేటినగరం, జూన్ 28: కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం మలేరియా వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. కత్తెరపల్లి ఆది ఆంధ్రవాడను సందర్శించి దోమల లార్వాలను గుడ్డు దశలో ఉన్నప్పుడే నిర్మూలించాలని సూచించారు. కత్తెరపల్లె పీహెచ్‌సీ డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటిని క్రమం తప్పకుండా పరీక్షించాలి

కార్వేటినగరం, జూన్ 28: తాగునీటి పరీక్షలు క్రమం తప్పకుండా చేయాలని డీఎల్‌ఏటీవో డాక్టర్ వెంకటప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆలత్తూరు గ్రామ సచివాలయాన్ని సందర్శించిన ఆయన వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాలు పడుతున్నందున గ్రామాల్లో డయేరియా వ్యాపించే అవకాశముందని, ఆరోగ్య వైద్య సిబ్బంది అప్రమత్తంగా మెలగాలని సూచించారు. ఆలత్తూరు నీటి నమూనాలలో డయేరియా కలిగించే బ్యాక్టీరియా ఉన్నట్లు పరీక్షల్లో తేలినందున పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు.

11 మందికి జరిమానా

చిత్తూరు లీగల్, జూన్ 28: మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందికి చిత్తూరు న్యాయస్థానం జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గురువారం 11 మందిని అదుపులోకి తీసుకుని శుక్రవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి ఉమాదేవి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు.

రూ.3.79 లక్షలకు సంత వేలం

గంగాధరనెల్లూరు, జూన్ 28: గంగాధరనెల్లూరు సంతను దళితవాడకు చెందిన విజయకుమార్ వేలం పాటలో రూ.3,79,500లకు దక్కించుకున్నారు. షాపింగ్ కాంప్లెక్స్‌లో గదిని గంగాధరనెల్లూరు గ్రామానికి చెందిన మల్లీశ్వరి రూ.26,600లకు తీసుకున్నారని అధికారులు తెలిపారు.

రేపు ఈడిగ సంఘ సమావేశం

యాదమరి, జూన్ 28: మండల ఈడిగ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరుగుతుందని ఆ సంఘ జనరల్ సెక్రటరీ మునికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాశిరాళ్ల గంగమ్మగుడి ఆవరణలో జరిగే సమావేశానికి ఈడిగ కులస్థులందరూ హాజరుకావాలని కోరారు.

విద్యాసామగ్రి వితరణ

బంగారుపాళ్యం, జూన్ 28: మండలంలోని ఈచనేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు టీడీపీ బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హరిప్రసాద్ విద్యాసామగ్రి పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ శివరాజ్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సరిత, ఉపాధ్యాయులు ఉష పాల్గొన్నారు.

సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జి నియామకం


శ్రీనివాసులురెడ్డి

గంగాధరనెల్లూరు, జూన్ 28: సింగిల్‌విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి అధికారిగా చిత్తూరు సబ్ డివిజనల్ కోఆపరేటివ్ కార్యాలయ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసులురెడ్డిని నియమించారు. గత వైసీపీ ప్రభుత్వంలో సింగిల్‌విండో త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా వేల్కూరు బాబురెడ్డి కొనసాగారు. ప్రభుత్వం మారడంతో ఆయన ఈనెల 9వ తేదీన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం శ్రీనివాసులురెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

డయేరియాను తరిమికొట్టడమే లక్ష్యం

గంగాధరనెల్లూరు, జూన్ 28: డయేరియాను తరిమికొట్టడమే లక్ష్యంగా పనిచేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ప్రభావతి పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు మండలం కడపగుంటలో ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. పీ.బీ.అగ్రహారంలో ర్యాలీలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం నీటిసంపులు, తొట్టెలను బ్లీచింగ్‌తో క్లీన్‌చేసి, డ్రైడేగా పాటించాలన్నారు. చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

పల్లాను కలిసిన టీడీపీ నేతలు



యాదమరి, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసులు యాదవ్‌ను టీడీపీ మండల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం అమరావతిలోని ఆయన కార్యాలయంలో మండలాధ్యక్షుడు మురార్జీ యాదవ్, విజేంద్రయాదవ్, మహేష్‌యాదవ్, మధు యాదవ్, ధరణీప్రకాష్ కలిసి సన్మానించారు.

ఎలక్ట్రీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, జూన్ 28: ఇరువారం పీహెచ్‌కాలనీ వద్ద ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ) ఆధ్వర్యంలో నడుస్తున్న శిక్షణా కేంద్రంలో ఎలక్ట్రీషియన్ కోర్సుపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలు శిక్షణతో పాటు సర్టిఫికెట్ ఇస్తామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9966489502ను సంప్రదించాలని కోరారు.

గుర్రప్ప సేవలు అభినందనీయం

కార్వేటినగరం, జూన్ 28: కేఎంపురం జడ్పీ హైస్కూల్ సైన్స్ టీచర్‌గా గుర్రప్ప సేవలు అభినందనీయమని ఎంఈవో విజయ్‌కుమార్ కొనియాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయ బృందం ఆయన్ను శుక్రవారం ఘనంగా సన్మానించింది. 36సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి



నింద్ర, జూన్ 28: నింద్ర మండల అభివృద్ధికి సహకరించాలని స్థానిక టీడీపీ నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు మండల కేంద్రానికి వచ్చిన కలెక్టర్‌కు వారు శుక్రవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వెంకటేశ్వరావు, విజయ్‌కుమార్, చిట్టిబాబు, లోకనాథం, రవినాయుడు, దశరథవాసు, రమేష్ పాల్గొన్నారు.

నాణ్యతలేని గ్రైండర్లు ఇచ్చారని ఫిర్యాదు

చిత్తూరు, జూన్ 28: నాణ్యత లేని గ్రైండర్లు ఇచ్చిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని పలువురు మహిళలు శుక్రవారం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రశాంత్‌నగర్, ఓటి చెరువులకు చెందిన 70 మంది మహిళల వద్ద రూ.3,500 వసూలు చేసి రూ.వెయ్యి విలువ చేసే నాసిరకం గ్రైండర్లను ఇచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ జరిపి డబ్బులు ఇప్పించాలని కోరారు. కేసు నమోదు చేసిన పోలీసులు త్వరలో నిందితుడిని పట్టుకుంటామని చెప్పడంతో వారు వెనుదిరిగారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య


మృతిచెందిన హేమాద్రి

బంగారుపాళ్యం, జూన్ 28: జీవితంపై విరక్తితో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కేజీ సత్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. కేజీ సత్రానికి చెందిన హేమాద్రి (35) జీవితంపై విరక్తి చెంది తాగుడుకు బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు బంగారుపాళ్యం పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి


కలెక్టర్, ఎమ్మెల్యేలకు సమస్యలను వివరిస్తున్న నెట్టేరి సర్పంచ్ సరోజమ్మ

నింద్ర, జూన్ 28: మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దీప అధ్యక్షతన నింద్ర మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను సర్పంచ్‌లు తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మేళంబాకం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అంగన్వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలు కిలోమీటర్ దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త పోస్ట్ ఏళ్ల తరబడి ఖాళీగా ఉందన్నారు. నెట్టేరి సర్పంచ్ సరోజమ్మ మాట్లాడుతూ తమ గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, శ్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. ఐఆర్ కండ్రిగ సర్పంచ్ సంధ్యాదేవి మాట్లాడుతూ తమ గ్రామంలో నీరు ఉప్పుగా ఉందని, మంచి నీటి సౌకర్యం కల్పించాలని, శ్మశానం ఏర్పాటు చేయాలని కోరారు. కొప్పేడు దళితవాడలో తాగునీటి కాలుష్యం ఉందని తెలిపారు. ఇరుగువాయి సర్పంచ్ రాజేష్ మాట్లాడుతూ ఇరుగువాయి చెరువులో రంగునీరు కలువడంతో నీరు కాలుష్యం అవుతుందన్నారు. అంతకుముందు కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అజెండాలో ఎమ్మెల్యే పేరు లేకపోవడంపై మండిపడ్డారు. ఇకమీదట అలా జరగకుండా చూసుకుంటామని అధికారులు చెప్పడంతో శాంతించారు. సమస్యల పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ మండల సమగ్రాభివృద్ధికి అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవాని, తహసీల్దారు నాగమణి, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

చెప్పింది చేయడమే చంద్రన్న ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూన్ 28: చెప్పింది చేయడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయన అధికారులు, టీడీపీ నాయకులతో సమావేశమయ్యారు. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ దశలవారీగా నెరవేరుస్తున్నారన్నారు. పింఛన్ల పంపిణీలో అధికారులు అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రూ.3 వేలు ఉన్న పింఛన్‌ను రూ.4 వేలు చేసి సీఎం మాట నిలబెట్టుకున్నారని అన్నారు. పేదల కడుపు కొట్టి జగన్ పాలన సాగితే వారి కడుపు నింపడానికి చంద్రబాబు అడుగులు ముందుకు వేస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

అరాచకాలకు కేరాఫ్ పిన్నెల్లి : టీడీపీ

చిత్తూరు సిటీ, జూన్ 28: వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అరాచకాలకు కేరాఫ్ అడ్రస్‌గా తయారయ్యారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ విమర్శించారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా మాజీ సీఎం జగన్ అండతో అరాచకాలు, విధ్వంసాలు, హత్యలకు పాల్పడుతూ ఆయన పల్నాడును అడ్డాగా మార్చుకున్నారని ఆరోపించారు. ఈవీఎంను ధ్వంసం చేయడం, పోలీసులు, టీడీపీ నేతలపై హత్యాయత్నానికి పాల్పడటం వంటి ఘటనలతో రిమాండ్‌కు వెళ్లారని చెప్పారు. ఇలాంటి వారికి ప్రజా జీవితంలో ఉండే అర్హత లేదన్నారు. పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ పాల్గొన్నారు.

అవినీతి ఊబిలో డీటీలు


మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 28: సోమల రెవెన్యూ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్లు అవినీతి ఊబిలో కూరుకు పోయారని ఏపీ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ సోమల రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్లుగా ఉన్న శ్యాంప్రసాద్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి రైతులకు చెందిన 1బి, అడంగల్ బ్లాక్ చేసి, బ్యాంకుల్లో రుణాలు రాకుండా, రెన్యూవల్ కాకుండా చేశారన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డితో కలసి రైతుల భూములను అటవీ భూములంటూ గాడులు తీయించి అనేక ఇబ్బందులకు గురిచేశారని పేర్కొన్నారు. అక్రమ కేసులు పెట్టించి వేధించారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ ఫార్మర్స్ అసోసియేషన్ సభ్యులు పద్మనాభనాయుడు, మునిరత్నం, నాగరాజు, దాసరి చంద్ర పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన బ్యానర్ చించివేత



పాలసముద్రం, జూన్ 28: మండలంలోని ఆముదాల సచివాలయం పక్కన జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన బ్యానర్‌ను ఆముదాల సెగ్మెంట్‌కు చెందిన ఎంపీటీసీ లిఖిత, ఆమె తల్లి లిల్లీతో పాటు మరికొందరు చించివేశారని పాలసముద్రం ఎస్‌ఐకి టీడీపీ నాయకుడు అరుళ్‌నాథన్ ఫిర్యాదు చేశారు. గురువారం టీడీపీ నాయకులు సచివాలయాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. సచివాలయ ముఖద్వారానికి మామిడి తోరణాలు, అరటిచెట్లు కట్టించి సంబరాలు చేశారు. తమ అనుమతి లేకుండా ఎలా కడతారంటూ ఎంపీటీసీ లిఖిత, ఆమె తల్లి లిల్లీ పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణతో వాగ్వాదం చేశారు. దీంతో శుక్రవారం మామిడి తోరణాలు, అరటి చెట్లతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన రైలింగ్‌ను కూల్చేశారు. బ్యానర్‌ను చించేశారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు పాలసముద్రం ఎస్‌ఐ భారతి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సినీఫక్కీలో వృద్ధురాలి మెడలో చైను చోరీ


బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

తవణంపల్లె, జూన్ 28: మండలంలోని కామాలూరు గ్రామంలో శుక్రవారం సినీ ఫక్కీలో వృద్ధురాలి మెడలో బంగారు చైను చోరీ జరిగింది. వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి వివరాల మేరకు కామాలూరుకు చెందిన చంద్రకాంతమ్మ(75) ఇంటి వద్ద ఒంటరిగా ఉంటోంది. శుక్రవారం ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వద్ద తచ్చాడుతూ సాయంత్రం సమయంలో దాహంగా ఉందని తాగునీరు ఇవ్వాలని చంద్రకాంతమ్మను కోరారు. ఆమె నీరు ఇచ్చేందుకు ఇంట్లోకి వెళ్లగా ఒక వ్యక్తి చంద్రకాంతమ్మ మెడలోని 26 గ్రాముల బంగారు చైనును లాక్కొని సిద్ధంగా ఉన్న పల్సర్ బైక్‌పై సరకల్లు వైపు పారిపోయాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్థులు, బంధువులు దొంగలను వెంబడించారు. దొరక్కపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ రవిశంకర్‌రెడ్డి అక్కడికి చేరుకుని బాధితురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందాల ద్వారా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు : యువకుడి మృతి


మృతిచెందిన ఆదిత్యన్

బంగారుపాళ్యం, జూన్ 28: చెన్నై - బెంగళూరు జాతీయ రహదారిలో మొగిలి ఘాట్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కేరళ రాష్ట్రం కట్టానం గ్రామానికి చెందిన సునీల్ కుమారుడు ఆదిత్యన్ స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి చిత్తూరు నుంచి బెంగళూరు వైపు కారులో వెళుతున్నాడు. మొగిలి ఘాట్‌లో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో కారు అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆదిత్యన్ (20) అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రవీణ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బంగారుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈగా బభ్రూవాహన

చిత్తూరు రూరల్, జూన్ 28: చిత్తూరు ట్రాన్స్‌కో అర్బన్ ఈఈగా బభ్రూవాహనను నియమిస్తూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన ఇంతకు ముందు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు డివిజన్ ఈఈగా విధులు నిర్వహించి, బదిలీపై చిత్తూరుకు వచ్చారు. మరో రెండు రోజుల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఈయనను కర్నూలు నుంచి చిత్తూరుకు బదిలీ చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్న మునిచంద్రా తిరిగి జూలై ఒకటో తేదీ నుంచి చిత్తూరు అర్బన్ ఈఈగానే కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు



చిత్తూరు సిటీ, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస యాదవ్‌కు జిల్లా టీడీపీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన్ను చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, యాదవ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ మణిగోపాల్ యాదవ్, జిల్లా కార్యదర్శి జయచంద్ర నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

శివాలయంలో విగ్రహం చోరీ

పెనుమూరు, జూన్ 28: మండలంలోని కలవగుంట శివాలయంలో వినాయక విగ్రహాన్ని గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. శుక్రవారం ఉదయం ఈ విషయాన్ని గమనించిన పూజారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ కుళాయప్ప, ఎస్‌ఐ లోకేష్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. త్వరలో నిందితులను పట్టుకుంటామని తెలిపారు.

పనిచేయని సిబ్బందిని తొలగిస్తాం

పెనుమూరు, జూన్ 28: ఉపాధి హామీ పథకంలో పనిచేయని, అలసత్వం వహించిన సిబ్బందిని తొలగిస్తామని డ్వామా పీడీ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గుత్తావాండ్లవూరు, రామకృష్ణాపురం, శాతంబాకం పంచాయతీల్లో అమృత్‌సరోవర్ పాండ్, ఫిష్ పాండ్, ఫీడర్ కాలువలను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఏపీడీ సుబ్రమణ్యం, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, ఏపీవో మీనాకుమారి, సతీష్ పాల్గొన్నారు.

వైభవంగా పుష్పపల్లకి సేవ



తవణంపల్లె, జూన్ 28: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుష్పపల్లకి సేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామివారికి తిరుమంజనం, పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులకు ఊంజల్‌సేవ నిర్వహించి, మేళతాళాల నడుమ పురవీధుల్లో పుష్పపల్లకిపై ఊరేగించారు. భక్తుల కాలక్షేపం నిమిత్తం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వర‌రెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయ సమస్యలు

చిత్తూరు (సెంట్రల్), జూన్ 28: ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలని నోబుల్ టీచర్స్ సంఘం తీర్మానించింది. జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ అధ్యక్షతన శుక్రవారం స్థానిక తపోవనంలో జరిగిన సమవేశంలో ఉపాధ్యాయ సమస్యలపై సమీక్షించారు. అనంతరం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా సహాధ్యక్షుడిగా మునస్వామి, ఉపాధ్యక్షుడిగా నరసింహులును ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రమేష్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు రాఘవుల నాయుడు పాల్గొన్నారు.

భక్తుల అన్నదానం



కార్వేటినగరం, జూన్ 28: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం వద్ద శుక్రవారం పలువురు భక్తులు అన్నదానం చేశారు. అన్నదానం చేయదలచిన వారు ముందుగానే పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయాధికారి సురేష్ కుమార్ సూచించారు.


గుడిపాల మండలం ఓ వెంకటాపురంలో జరిగిన నాగాలమ్మ తిరుణాళ్లలో చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్

ఘనంగా థామస్ జన్మదిన వేడుకలు


ఎస్‌ఆర్‌పురంలో అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే


వెదురుకుప్పం : కేక్ కట్ చేస్తున్న కార్తీక్

పెనుమూరు, జూన్ 28: జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ జన్మదిన వేడుకలను పెనుమూరులో ఘనంగా నిర్వహించారు. బజారు వీధి నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో కేక్ కోశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. బీజేపీ కార్యాలయంలో కూటమి నాయకులను కలిశారు.

కార్వేటినగరం : స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి, కార్యకర్తలకు పంచిపెట్టారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే థామస్ తెలిపారు.

శ్రీరంగరాజపురం : టీడీపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యేను సన్మానించారు. అన్నదానం చేశారు. చొక్కమడుగులో మినరల్ ప్లాంట్‌ను ప్రారంభించారు.

వెదురుకుప్పం : వెదురుకుప్పంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్ ఎమ్మెల్యే దంపతులకు శాలువ కప్పి సన్మానించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అగ్గిచేనుపల్లెలో ఐటీడీపీ మండలాధ్యక్షుడు కార్తీక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.